క్లుప్తంగా

నూతన కార్యవర్గం



మెడికల్ సేల్స్, రెప్రజెంటేటివ్స్ యూనియన్ కార్యవర్గం

ప్రొద్దుటూరు క్రైం : ఏపీ మెడికల్ సేల్స్, రెప్రజెంటేటివ్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక టీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా పి.నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎంఎల్ నరసింహులు, బి.రవిప్రకాష్, కార్యదర్శులుగా రామలింగారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎస్.రెడ్డయ్య, సూర్య పెద్దిరాజు, కోశాధికారిగా కృష్ణ సుమంత్‌లను ఎన్నుకున్నారు. అలాగే ఏడుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామాంజులరెడ్డి, విశ్వనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ



నాగేశంను పరామర్శిస్తున్న ఈశ్వరయ్య

అట్లూరు : తీవ్ర అనారోగ్యానికి గురై తిరుపతిలో చికిత్స పొంది ఆపరేషన్ చేయించుకుని బద్వేలు పట్టణంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశంను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య ఆదివారం సీపీఐ జిల్లా సమితి ప్రతినిధి బృందంతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యం అందిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పలు సూచనలు చేశారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.వేణుగోపాల్, వీరశేఖర్, కడప నగర కార్యదర్శి వెంకటశివ, విజయలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, బద్వేలు పట్టణ కార్యదర్శి బాలు, ఏఐటీయూసీ బద్వేలు ఏరియా కార్యదర్శి పి.వి.రమణ, చేతివృత్తిదారుల సంఘం బద్వేలు ఏరియా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్ సుజాత దంపతులు

గోపవరం : గోపవరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్‌గా పని చేస్తున్న అనకర్ల చిన్నఓబయ్య గత నెల 28వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు గోపవరం సచివాలయం హెల్త్‌అసిస్టెంట్ సుజాత, ఆమె భర్త హరీష్ నిత్యావసర సరుకులతోపాటు బియ్యం, రూ.8 వేలు నగదు ఆదివారం అందజేశారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో వారు కష్టాలు పడుతున్నారు.


క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సగర సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డు మండి మార్చంట్స్ సమీపంలో ఆదివారం కడప జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్ ఆవిష్కరించారు. సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లాయర్ చంద్ర, కోశాధికారి జోడు శివప్రసాద్, సగర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర మురళీధర్, సభ్యులు పల్లవోలు రామాంజనేయులు, వరికేటి సుబ్బరాయుడు, మజ్జారి లక్ష్మీనారాయణ, శ్రీను, వెంకటరమణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



బద్వేలు అర్బన్ : బద్వేలు తాలూకా ఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.అమర్‌నాథ్‌రెడ్డి, కార్యదర్శి టి.నరసింహారెడ్డి, కోశాధికారి శివరామిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ సాధు వెంకటేశ్వర్లు, తాలూకా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునయాదవ్, క్రిష్ణశర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, యూనియన్ నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాలువ తీరిది.. సాగుకు దారేది?



కేసీ కాలువలో పేరుకుపోయిన పూడిక



కేసీ కాలువ అప్రోచ్ రోడ్డుపై పెరిగిన పిచ్చి మొక్కలు



కేసీ కాలువకు లైనింగ్ లేకుండా ఉన్న ప్రధాన కాలువ

- కేసీ కాలువలో సమస్యల తిష్ట
- పేరుకుపోయిన పూడిక
- షట్టర్లు లేక నీటి వృథా
- పర్యవేక్షణ కరువు
- ఆందోళనలో రైతులు

ఖాజీపేట : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది పరిస్థితి. కేసీ కాలువకు నీరు విడుదల చేస్తున్నా.. కాలువల నిర్వహణ లోపం వల్ల నీరు సక్రమంగా రాక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక నీరు వచ్చినప్పుడు ఎలాగోలా పారుతుంది. నీరు తక్కువగా వచ్చినప్పుడు చివరి ఆయకట్టు రైతులు కష్టాలు పడుతున్నారు.

ప్రధాన నీటి వనరు కేసీ కాలువ

ఖాజీపేట మండలం పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఒక వైపు కుందూ, పెన్నా నదీ ప్రవాహాలు ఉండగా.. మరో పక్క చిన్న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో కన్నెలవాగు చెరువు, నాగసానిపల్లె చెరువుల ద్వారా నీరు అందుతోంది. ఇవే కాక తెలుగు గంగ నీరు అందుతోంది. అయితే కేసీ కాలువ నుంచి వచ్చే నీటి ద్వారానే సాగు అధికంగా ఉంటుంది. మండలంలో కేసీ కాలువ ద్వారా 20,818 ఎకరాలు సాగు అవుతుంది. అందులో కేసీ కాలువకు నీరు వస్తే 5 చెరువులు నిండుతాయి. పుల్లూరు చెరువు ద్వారా 340 ఎకరాలు, రావులపల్లె చెరువు 184 ఎకరాలు, దుంపలగుట్ట చెరువు 160 ఎకరాలు, చెమ్ముళ్ళపల్లె చెరువు 361 ఎకరాలు, నందిపాడు చెరువు నుంచి 310 ఎకరాలు సాగు అవుతుంది.

నీటి ప్రవాహానికి అడ్డంకిగా..

ప్రధాన కాలువకు నీరు రావడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. ప్రధాన కాలువ నుంచి వచ్చే చిన్న కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోయి ఉన్నాయి. దీంతో చిన్న కాలువల్లో నీరు సక్రమంగా రావడం లేదు. ప్రధాన కాలువకు అధికంగా నీరు వచ్చినప్పుడు సక్రమంగా వస్తాయి. అరకొరగా వచ్చినప్పుడు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల పూడిక పూర్తిగా తొలగిస్తే చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందని రైతులు తెలుపుతున్నారు.

కాలువకు ఇరువైపులా కంప చెట్లు

కేసీ కాలువ ప్రధాన రహదారి ఇరువైపులా కంప చెట్లు పెరిగాయి. ఒకప్పుడు కాలువపై రెండు వాహనాలు వచ్చి వెళ్లే వీలు ఉండేది. కానీ నేడు ఒక్క వాహనం రావడం కష్టంగా మారింది. ఎందుకంటే కంప చెట్లు కొంత కాలంగా తొలగించక పోవడంతో కాలువకు ఇరువైపులా అధికంగా పెరిగాయి. దీని వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాలువకు ఆనుకుని సాగులో ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాలువనూ ఆక్రమించేస్తున్నారు

కేసీ కాలువ ఆక్రమణలు అధికమయ్యాయి. ప్రధాన కాలువను కొందరు రైతులు తమ స్వార్థం కోసం కొద్ది కొద్దిగా కరకట్టను తొలగిస్తూ ఆక్రమిస్తున్నారు. అలాగే ప్రధాన కాలువ నుంచి దిగువ కాలువలు సైతం పూర్తి ఆక్రమణకు గురయ్యాయి. గతంలో కాలువ మరమ్మతులు చేసుకునేందుకు కాలువపై నుంచి వెళ్లేందుకు కరకట్టలు ఉండేవి. నేడు అవి పూర్తిగా కనుమరుగయ్యాయి. కొందరు రైతులు ఏకంగా కాలువ కరకట్ట పైనే సాగు చేస్తుండటం గమనార్హం. అధికారుల దృష్టికి సమస్యలు వచ్చినా.. సరైన స్పందన లేక పోవడం వల్ల ఆక్రమణల పర్వం అలాగే కొనసాగుతోంది.

షట్టర్లకు మరమ్మతులు ఎప్పుడు?

ప్రధాన కాలువ నుంచి సబ్ కాలువలకు వెళ్లేందుకు అక్కడక్కడా షట్టర్లు ఉండేవి. వాటి ద్వారా నీటి ప్రవాహాన్ని బట్టి కాలువకు నీరు అందించే వారు. కానీ షట్టర్లు లేక పోవడం తో నీటి ప్రవాహం ఇష్టానుసారంగా సాగుతోంది. దీనివల్ల కాలువకు ముందు భాగంలోని వారికి త్వరగా నీరు వస్తుంది. చివరి ఆయకట్టు రైతులకు ఆలస్యంగా వస్తోంది. గతంలో షట్టర్లు బిగించినా దొంగలు చోరీ చేస్తుండటంతో అధికారులు తిరిగి బిగించే ప్రయత్నం పూర్తిగా ఆపేశారు.

నీటి సంఘంతోనైనా..

కేసీ కాలువ నుంచి నీరు రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం తాజాగా నీటి సంఘం ఎన్నికలు నిర్వహించింది. నీటి సంఘంతోపాటు డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలను ఏర్పాటు చేసి కొత్తగా నియమించింది. నీటి పాలక వర్గాల ద్వారానైనా కేసీ కాలువ సాగు సమస్యలు పరిష్కారం అవుతాయా లేదా అని రైతులు అంటున్నారు. నిధులు ఇవ్వకుండా నామమాత్రపు పదవులు ఉండటం వల్ల.. రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదని కేవలం రాజకీయ పదవులు కేటాయించేందుకు సరిపోతుందని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కేసీ కాలువ రైతుల సమస్యలు పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలి. ముఖ్యంగా పూడిక తొలగింపు, కాలువకు ఆనుకుని పెరిగిన కంప చెట్ల తొలగించాలి. కాలువ ఆధునీకరణ పనులు చేపట్టాలి. కాలువకు నీరు పూర్తి స్థాయిలో వచ్చేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది.

– పీవీ రాఘవరెడ్డి, మాజీ అధ్యక్షుడు, అగ్రహారం సొసైటీ

చర్యలు తీసుకుంటాం



కేసీ కాలువ సమస్యలు తెలుసుకునేందుకు కాలువపై అధికారులతోపాటు తిరుగుతున్నాం. ఇప్పటికే కాలువ పూడికలను గుర్తించాం. కాలువపై పెరిగిన చెట్లు తొలగించేందుకు, చెరువులు, సబ్ కాలువల పరిస్థితులపై పర్యవేక్షిస్తున్నాం. సమస్యలను గుర్తించి పనుల మంజూరుకు నివేదికలు పంపుతున్నాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి కాలువ ద్వారా నీటి ప్రవాహం సక్రమంగా ఉండేలా చేస్తాం. చివరి ఆయకట్టు వరకు పూర్తి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటాం.

– రెడ్యం రవీంద్రారెడ్డి, అధ్యక్షుడు, కేసీ కెనాల్ 13వ డిస్ట్రిబ్యూటరీ

సృజనాత్మకత పెంచుకోవాలి



నమూనా గురించి వివరిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఈఈఈ హెచ్‌ఓడీ మంజునాథ్ పేర్కొన్నారు. గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సృజనోత్సవ్–2కే25 టెక్నికల్ సింపోసియం నిర్వహించారు. విద్యార్థుల్లో పరిశోధనా సామర్థ్యం, నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. వివిధ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్‌లు అందరిని ఆకట్టుకున్నాయి. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్‌లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, ప్రిన్సిపాల్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

23న సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో ఆదివారం నేతాజీ సోషల్ స్టడీస్ క్లబ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 23న నిర్వహించే సాంఘికశాస్త్ర ప్రతిభా పరీక్ష కరపత్రాలను కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా 23న పద్మశాలీయ కల్యాణ మండపంలో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గురుకుమార్, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు జమాల్‌రెడ్డి, సుబ్బయ్య, వన్నప్ప, మైసూర్ పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీబీఎస్ఈ బోర్డు ప్రతినిధి చంద్రజ్యోతి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని పూజా ఇంటర్ నేషనల్ స్కూల్‌లో ఆదివారం ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ అండ్ కన్సర్వేషన్ ఆఫ్ నేచురల్ రిసోర్సెస్ అనే అంశంపై సీబీఎస్ఈ బోర్డ్ వారు జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలల ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఎస్ఈ బోర్డు ప్రతినిధులు చంద్రజ్యోతి, ఉమా మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలన్నారు. పాఠశాలలో కబడ్డీ కోర్టు, రగ్బీ కోర్టులకు ఈ సందర్భంగా వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ ఫౌండేషన్ సీఈఓ బి.కవిత, ప్రిన్సిపాల్ నజీర్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ భువనేశ్వరి, డాడీహోం ప్రతినిధి భవ్య, జిల్లాలోని 10 సీబీఎస్ఈ పాఠశాలల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేపు నక్కలదిన్నెలో రెవెన్యూ సదస్సు

చాపాడు : మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దారు రమాకుమారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సదస్సు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడే నాయకుడి సమర్థత తెలుస్తుంది

- సీనియర్ నాయకులకు జిల్లా కమిటీలో స్థానం
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహులు



పోరుమామిళ్ల : సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



బద్వేలు అర్బన్ : ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : అధికారంలో లేనపుడు పార్టీని నడిపించడం చాలెంజ్‌గా తీసుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చెప్పారు. పోరుమామిళ్లకు చెందిన రాళ్లపల్లె నరసింహులుకు వైఎస్సార్‌సీపీ కడప జిల్లా కమిటీలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా స్థానం కల్పించడంతో ఆదివారం సాయంత్రం నరసింహులు ఇంటి వద్ద నుంచి పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చుతూ, నినాదాలు చేస్తూ కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో రాత్రి వైస్ ఎంపీపీ సీఎం బాషా అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడారు. నరసింహులు చాలా సీనియర్ నాయకుడని, తన కన్నా ముందు నుంచి రాజకీయాల్లో ఉన్నారన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయకపోయినా సమస్య లేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్యకర్తలను కాపాడుకోవాలన్నారు. నరసింహులు అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందన్నారు. ఆయన దమ్మున్న నాయకుడని పార్టీ కోసం గట్టిగా పోరాడగల సత్తా ఉన్నవారన్నారు. నియోజకవర్గంలో 9 మందికి జిల్లా కమిటీలో స్థానం కల్పించారని, నరసింహులు పోరుమామిళ్ల ప్రాంతంలోనే కాక, జిల్లాలో అవసరమైతే ఇతర జిల్లాల్లో పార్టీని ఆర్గనైజ్ చేయాల్సి ఉంటుందన్నారు. మన నియోజకవర్గానికి ఉపయోగపడుతూ జిల్లాకు కూడా ఉపయోగ పడాలన్నారు. సభలో పార్టీ జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు రాజీవ్‌బాషా, ఆప్కాబ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి నరసింహులును శాలువా పూలదండతో సన్మానించారు. పార్టీ నాయకులు, అభిమానులు నరసింహులును శాలువలు, దండలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి లక్ష్మినారాయణరెడ్డి, ఎంపీటీసీ ఇస్మాక్, ఉపసర్పంచ్ రవిచంద్రారెడ్డి, పార్టీ నాయకులు మస్తాన్, రుద్రవరం రాము, నారాయణరెడ్డి, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేయండి

బద్వేలు అర్బన్ : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రజా సమస్యలపై స్పందిస్తూ పార్టీ పురోభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన బోడపాటి రామసుబ్బారెడ్డి, గానుగపెంట రమేష్‌బాబులు ఆదివారం నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. వివిధ పదవుల్లో నూతనంగా నియమితులైన వారు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పని చేయాలని సూచించారు. అనంతరం రామసుబ్బారెడ్డి, రమేష్ బాబులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు. అలాగే తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, రంగసముద్రం పంచాయతీ సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, పలు కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు పుత్తా శ్రీరాములు, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



జనరల్ సెక్రటరీ ఆర్గనైజర్ లక్ష్మీనరసారెడ్డి

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ ఆర్గనైజర్‌గా పెద్దిరెడ్డి లక్ష్మీనరసారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ యోగానందరెడ్డి, మాజీ సర్పంచ్ వై.వెంకటసుబ్బయ్య, నాయకులు ప్రహల్లాదరెడ్డి, బి.సుబ్బారెడ్డి, బి.వెంకటేశ్వర్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, సిద్దారెడ్డిలతో కలిసి లక్ష్మీనరసారెడ్డి పోరుమామిళ్లలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తానని, పార్టీ అభివృద్ధికి పాటుపడతానని లక్ష్మీనరసారెడ్డి తెలిపారు. అనంతరం లక్ష్మీనరసారెడ్డిని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, రాజీవ్ బాష, రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

పార్టీకి రుణపడి ఉంటా



జనరల్ సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి

అట్లూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని ముత్తుకూరు గ్రామానికి చెందిన పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీ పదవుల నియామకాలు చేపట్టారని, అందులో భాగంగా బద్వేలు నియోజకవర్గం నుంచి తనను జనరల్ సెక్రటరీగా నియమించారని తెలిపారు. తన మీద నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధా కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి కృషి



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న జీవీ సుబ్బయ్య

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీవీ సుబ్బయ్య తెలిపారు. తనను పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఆయన ఆదివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీవీ సుబ్బయ్య మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో రాచమల్లు తనకు ఈ పదవి ఇప్పించారన్నారు. గతంలో కూడా తన సతీమణి రామలక్షుమ్మను జెడ్పీటీసీగా చేశారని అన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడుతానని తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, భావన హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ ఎ.రామకృష్ణ యాదవ్, నంగనూరుపల్లె శంకరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా కిరణ్మయి



భర్త రామచంద్రారెడ్డితో పల్లపోతుల కిరణ్మయి

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా మైదుకూరుకు చెందిన పల్లపోతుల కిరణ్మయి నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆమెకు నియామక పత్రం అందింది. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషిని గుర్తించిన పార్టీ అధిష్టానం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా ఆదివారం కిరణ్మయి మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి తాను మరింత కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కిరణ్మయిని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడం పట్ల ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లపోతుల రామచంద్రారెడ్డి పార్టీ అధిష్టానానికి, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

అట్లూరు : అట్లూరు క్రాస్ రోడ్డులోని రెడ్డి క్లినిక్‌లో ఆది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బద్వేలు పట్టణానికి చెందిన ఎస్‌వీఎస్ఎస్ సంజీవిని ఆస్పత్రి ఆధ్వర్యంలో కీళ్ల ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ అరుణ్‌జిత్‌షా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అలుపెరగని విద్యా సేవకుడు



సభలో మాట్లాడుతున్న గురుమూర్తి

పోరుమామిళ్ల : అందరి మన్ననలు పొందిన మాన్యులు, అలుపెరగని విద్యాసేవకుడు బొల్లు సిద్దయ్య మృతి సమాజానికి లోటని విశ్రాంత ఉపాధ్యాయులు, రిటైర్డు ఉద్యోగులు పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన బొల్లు సిద్దయ్య సంస్మరణ సభ ఆదివారం పట్టణంలోని శ్రీ రామచంద్రా రిక్రియేషన్ క్లబ్‌లో జరిపారు. సభలో డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ మార్కారెడ్డి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ వెంకటసుబ్బయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, మాజీ అధ్యక్షుడు గురుమూర్తి తదితరులు మాట్లాడుతూ ఉత్తమ విలువలతో విద్యను అందించి ఎందరో విద్యార్థులకు ఆదర్శ ఉపాధ్యాయుడుగా నిలిచి, గ్రామీణ విద్యార్థులను చదువువైపు మరల్చిన ఉపాధ్యాయుడు సిద్దయ్య అన్నారు.

8న వాలీబాల్ పోటీలు

మైదుకూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మైదుకూరులో ఈ నెల 8న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం అధికారి మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు మైదుకూరులోని మేధా డిఫెన్స్ అకాడమీ మైదానంలో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ట్రోఫీతోపాటు నగదు బహుమతి ఇస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తామని, పోటీల్లో పాల్గొనదలచిన వారు 8520001065కు ఫోన్ చేసి వారి టీం పేరును నమోదు చేసుకోవాలని కోరారు.

రేషన్ షాపులకు దరఖాస్తులేవి?

ప్రొద్దుటూరు : రేషన్ షాపుల నిర్వహణకు నిరుద్యోగులు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదు. ఈ కారణంగా దరఖాస్తు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రొద్దుటూరు మండలంలో ఖాళీగా ఉన్న 28 రేషన్ షాపుల డీలర్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో మున్సిపాలిటీకి సంబంధించి 15, మండల పరిధిలో 13 రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటన విడుదల చేశారు. వారం రోజుల క్రితం ఈ ప్రకటన విడుదలైంది. అయితే ఇప్పటికి రేషన్ షాపులకు దరఖాస్తులు పెద్దగా అందలేదు. ప్రస్తుతం రేషన్ షాపుల ఖాళీలకు సంబంధించి ఇప్పటి వరకు కేవలం 8 దరఖాస్తులు మాత్రమే అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కనీసం షాపునకు ఒకరి చొప్పునైనా దరఖాస్తు చేస్తారో లేదోనని చర్చించుకుంటున్నారు. ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తులు చేసేందుకు గడువు ఉంది.